సాక్షి
కామారెడ్డి
బుధవారం। 3। జనవరి। 2024

## న్యూస్‌రీల్

### ‘ప్రజల భద్రత కోసమే ట్రాఫిక్ నిబంధనలు’

కామారెడ్డి క్రైం: ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్పీ సింధు శర్మ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజల భద్రత కోసమే ట్రాఫిక్ నిబంధనలు రూపొందించారని పేర్కొన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే కుటుంబ పెద్దలపై కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. వాహనాలపై ప్రెస్, పోలీస్ స్టిక్కర్స్ పెట్టుకునే వారిని గుర్తించేందుకు త్వరలోనే స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

### ‘మళ్లీ దరఖాస్తు అవసరం లేదు’

కామారెడ్డి టౌన్: రైతుబంధు లబ్ధిదారులు మళ్లీ రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని కామారెడ్డి బల్దియా కమిషనర్ దేవేందర్ పేర్కొన్నారు. కొత్తవారు మాత్రమే ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పింఛన్లు పొందుతున్నవారు కూడా తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు అయోమయానికి గురికావద్దని సూచించారు.

### భక్తిశ్రద్ధలతో సంతమల్లన్నకు నైవేద్యాలు

వేల్పూర్: అంక్సాపూర్ జాతరలో సంతమల్లన్నకు భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. జాతర మరుసటి రోజున నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ. అంక్సాపూర్ గ్రామస్తులతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తమ ఆరాధ్యదైవమైన సంతమల్లన్నస్వామి దర్శనానికి వేలాదిగా తరలివచ్చారు. పంటలు సమృద్ధిగా ఇచ్చినందుకు పసుపుకొమ్ములు, గొర్రెలను సమర్పించారు. సల్లంగా చూడాలని వేడుకున్నారు. వీడీసీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి తన సతీమణితో కలిసి సంతమల్లన్నస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజాలు చేశారు. రాకేశ్‌రెడ్డి దంపతులను వీడీసీ సభ్యులు రాందాస్, పల్లె మహేశ్, సాక్కం మల్లారెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట వేల్పూర్ మండల మాజీ జెడ్పీటీసీ పాశపు రాజేందర్ రెడ్డి తదితరులున్నారు.

## ఎమ్మెల్యే కేవీఆర్‌ను అభినందించిన జేపీ నడ్డా

కామారెడ్డి టౌన్: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22న దేశవ్యాప్తంగా నిర్వహించాల్సిన ఉత్సవాలపై ఢిల్లీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎమ్మెల్యేను అభినందించారు. ఉద్ధండులైన మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలను ఓడించినందుకు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

## ● పెట్రోల్ కోసం బారులు



జీవదాన్ సమీపంలోని పెట్రోల్ బంక్‌లో రాత్రి 8 గంటల ప్రాంతంలో క్యూ..

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టంలో హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి కఠిన నిబంధనలు ఉండడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ట్రక్కు డ్రైవర్లు మంగళవారం ఆందోళన బాటపట్టారు. ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు మూడు రోజులపాటు సమ్మెలో ఉంటారన్న సమాచారంతో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందని భావించిన వాహనదారులు బంక్‌లకు పరుగులు తీశారు. దీంతో జిల్లావ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంక్‌లలో భారీ క్యూలు కనిపించాయి. అయితే డ్రైవర్లు ఆందోళన విరమించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. – కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్



జిల్లా కేంద్రంలోని బంక్‌లో బారులు తీరిన వాహనదారులు

# ఓటేయాలంటే.. నడవాల్సిందే

- అందుబాటులో లేని పోలింగ్ కేంద్రాలు
- ఓటుహక్కు వినియోగించుకోవడానికి మైళ్ల దూరం నడవాల్సిన దుస్థితి
- చాలాచోట్ల ఇదే పరిస్థితి..
- కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్

■ పాల్వంచ మండలంలోని భవానీపేట తండా కామారెడ్డి –సిరిసిల్ల రహదారికి కిలోమీటరు దూరంలో ఉంది. ఈ తండాలో 548 మంది ఓటర్లున్నారు. భవానీపేట తండా పంచాయతీ కూడా అయ్యింది. అయితే ఊళ్లో పోలింగ్ కేంద్రం లేకపోవడంతో గ్రామస్తులు ఓటేయడానికి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న భవానీపేటకు వెళ్లాల్సి వస్తోంది. గ్రామం నుంచి మెయిన్ రోడ్డు వరకు నడచుకుంటూ రావాల్సిందే.. అక్కడ బస్సెక్కి భవానీపేట స్టేజీ వద్ద దిగి మరో రెండు కిలోమీటర్లు నడవాలి. అంత దూరం వెళ్లిరావడం ఓటర్లకు సమస్యగా మారింది. కేంద్రం అందుబాటులో లేక కొందరు ఓటేయడానికి ఇష్టపడడం లేదు.

■ మాచారెడ్డి మండలంలోని లక్ష్మీరావులపల్లి గ్రామం కామారెడ్డి –సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉంది. పంచాయతీగా ఏర్పడి రెండు దశాబ్దాలవుతున్నా ఇప్పటికీ పోలింగ్ కేంద్రం లేదు. ప్రస్తుతం ఈ గ్రామంలో 851 మంది ఓటర్లున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలంటే వీరంతా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చుక్కాపూర్ గ్రామానికి వెళ్లాల్సిందే.. గతంలో రాజకీయ పార్టీలు వాహనాలను సమకూర్చేవి. ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించడంతో వారు పట్టించుకోవడం లేదు. దీంతో ఓటర్లు బస్సు, ఆటోల్లో వెళ్లి ఓటు వేస్తున్నారు. ఓటేయడం వ్యయప్రయాసలతో కూడుకున్న పనిగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, కామారెడ్డి: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమైనది. ఓటు ద్వారా తమకు నచ్చిన వ్యక్తిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకునే స్వేచ్ఛ ఉంటుంది. దీంతో ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు చెబుతుంటారు. కానీ పోలింగ్ కేంద్రాలను చేరువ చేయడంలో మాత్రం వారు విఫలమవుతున్నారు. దీంతో చాలామంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారు.

జిల్లాలో 526 పంచాయతీలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో 80 వార్డులు ఉన్నాయి. ఇందులో కొత్తగా ఏర్పాటైన వందకుపైగా పంచాయతీలలో పోలింగ్ కేంద్రాలు లేవు. ముఖ్యంగా మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో పోలింగ్ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు ఓటు వేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. మాచారెడ్డి, గాంధారి, లింగంపేట, పెద్దకొడప్‌గల్, బాన్సువాడ, తాడ్వాయి, రాజంపేట, నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, జుక్కల్ తదితర మండలాల్లోని గిరిజన తండాల్లో అందుబాటులో పోలింగ్ కేంద్రాలు లేకపోవడంతో నాలుగైదు కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి ఉంది. మాచారెడ్డి మండలంలోని లక్ష్మీరావులపల్లి, గుంటి తండా, బంజెపల్లి తండా, సోమారంపేట తండా, కొత్తపల్లె, అంతంపల్లి, సున్నపురాళ్ల తండా, నడిమితండా, వెను కతండా, కాకులగుట్టతండా, బ్రాహ్మణపల్లి తండా, ఎల్లారెడ్డి మండలంలోని సబ్‌దల్పూర్, దావల్ మల్కపల్లి, అల్మాజీపూర్, పిట్లం మండలం క్యాజీనాయక్ తండా, నాగంపల్లి, నాగంపల్లితండా, మంగల్‌చంద్‌తండా, బ్రాహ్మణపల్లితండా, జగదాంబ తండా, కిష్టాపూర్ తండా, కారేగాం తండా, రాంపూర్ తండా, సిద్దాపూర్ తండా.. ఇలా చాలా చోట్ల పోలింగ్ కేంద్రాలు లేవు. దశాబ్దాలుగా ఓటు వేయడానికి మూడు నాలుగు కిలోమీటర్లు నడిచి పొరుగూరుకి వెళ్లాల్సి వస్తోందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారం కావడంతో చాలామంది ఓటేయడానికి ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్ని గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



**అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా పోలింగ్ బూత్‌ల వివరాలు..**

| నియోజక వర్గం | బూత్‌లు |
|---|---|
| కామారెడ్డి | 266 |
| ఎల్లారెడ్డి | 270 |
| జుక్కల్ | 255 |
| బాన్సువాడ | 258 |

### ఏళ్లుగా కోరుతున్నాం



మా గ్రామంలో పోలింగ్ కేంద్రం లేకపోవడంతో పొరుగున ఉన్న చుక్కాపూర్‌కు వెళ్లాల్సి వస్తోంది. అంతదూరం వెళ్లి ఓటేయడానికి చాలా మంది ఆసక్తి చూపడం లేదు. అందుకే గ్రామంలోనే పోలింగ్‌కేంద్రం ఏర్పాటు చేయాలని ఏళ్లుగా కోరుతున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.
– నవీన్‌రెడ్డి, లక్ష్మీరావులపల్లి, మాచారెడ్డి మండలం

### నడవలేకపోతున్నాం..



మా ఊళ్లో పోలింగ్ కేంద్రం లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రేపల్లెవాడ గ్రామానికి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. ముసలివాళ్లు నడచుకుంటూ వెళ్లలేకపోతున్నారు. మా దగ్గర కేంద్రం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగుతాయి.
– భూదేవి, దావల్ మల్కపల్లి, ఎల్లారెడ్డి మండలం

### మా దగ్గర కేంద్రం పెట్టాలె...



ఏండ్ల సంది చూస్తున్నం. ఓటు వేయాలంటే పొరుగూరికి పోవాల్సిందే. మా దగ్గరనే కేంద్రం పెట్టాలని మస్తు సార్లు అడిగినం. ఓట్లు వచ్చినపుడు చూద్దాం అంటున్నరు కానీ పెడుతలేదు. ఇక్కడే పోలింగ్ కేంద్రం పెడితే సౌలత్ ఉంటది. – కే.బాల్‌సింగ్, సిద్దాపూర్ తండా, పిట్లం మండలం

# కేబినెట్‌లో ఇద్దరికి చాన్స్!





కాంగ్రెస్‌లో సీనియర్ నేత సుదర్శన్‌రెడ్డికి రెండోవిడత మంత్రివర్గ విస్తరణలో అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. తన సొంత నియోజకవర్గమైన కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి పోటీ చేయగా షబ్బీర్ అలీ నిజామాబాద్ అర్బన్ నుంచి నిలబడి ఓడిపోయారు. మైనారిటీ కోటాలో ఆయనకు మంత్రివర్గంలో స్థానం దక్కనున్నట్లు తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుంచి బీసీ వర్గానికి చెందిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ పీఠం దక్కే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

- సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌లకు మంత్రి పదవులు దక్కే అవకాశం
- జిల్లా నుంచి నామినేటెడ్ పదవుల కోసం సీనియర్ నేతల ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : మొదటి విడతలో మంత్రి పదవులు దక్కని నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు విస్తరణలో ఏకంగా రెండు బెర్త్‌లు దక్కనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బోధన్ నుంచి నాలుగోసారి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి, సీనియర్ నేత షబ్బీర్ అలీకి రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కనున్నట్లు తెలుస్తోంది. పైగా వీరిద్దరూ రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు. పార్టీ అధినాయకత్వం వద్ద సైతం వీరిద్దరికి మంచి పలుకుబడి ఉండడంతో కచ్చితంగా చాన్స్ దక్కనున్నట్లు సమాచారం. వీరిద్దరూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లలో పనిచేశారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్‌గా ఉన్న సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ బెర్త్ ఖరారు కాగా రెండోవిడతలో ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక షబ్బీర్‌అలీ తన సొంత నియోజకవర్గం కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి పోటీ చేయడంతో ఆ సీటును త్యాగం చేశారు. షబ్బీర్ నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. సీటును త్యాగం చేయడంతో పాటు మైనారిటీ కోటాలో షబ్బీర్‌కు కేబినెట్‌లో బెర్త్ దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. షబ్బీర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్‌లో అవకాశమిస్తే కామారెడ్డితో పాటు నిజామాబాద్‌అర్బన్‌లో సైతం కేడర్‌కు భరోసా ఇచ్చినట్లేనని పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే మంత్రివర్గ విస్తరణ లోక్‌సభ ఎన్నికలకు ముందు చేస్తారా.. తరువాత చేస్తారా అనే విషయమై ఇంకా స్పష్టత రాలేదు.

### మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి?

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి దక్కనున్నట్లు తెలుస్తోంది. మైనారిటీ అభ్యర్థిని నిలబెట్టిన నేపథ్యంలో అధినాయకత్వం సూచన మేరకు మహేశ్‌కుమార్ గౌడ్ నిజామాబాద్ అర్బన్ టికెట్టును త్యాగం చేశారు. పైగా పార్టీ ఆర్గనైజింగ్ వ్యవహారాలను వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహేశ్‌కుమార్ గౌడ్ అత్యంత సమర్థంగా నిర్వహిస్తూ వస్తున్నారు. గతంలోనే పార్టీ అధినాయకత్వం మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఎమ్మెల్సీ పదవితో పాటు పీసీసీ పీఠం సైతం అప్పగించేందుకు పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. నలభై సంవత్సరాలుగా పార్టీకి సేవలందిస్తున్న మహేశ్‌గౌడ్ ఎన్‌ఎస్‌యూఐ నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా, పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగించి ఆ తరువాత మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ పీఠం అప్పగిస్తారని తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఓసీ కావడంతో పాటు దక్షిణ తెలంగాణ నుంచి ఉండడంతో ఉత్తర తెలంగాణ నుంచి బీసీ వర్గానికి చెందిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు తప్పనిసరిగా పీసీసీ పీఠం దక్కే అవకాశాలు ఉన్నాయని పార్టీ నాయకులు, శ్రేణులు, గాంధీభవన్ వర్గాలు చెబుతుండడం గమనార్హం. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నాయకులు నామినేటెడ్ పదవుల కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.



# ఇసుకాసురులపై చర్యలు తప్పవు

- అక్రమార్కులనుంచి ప్రతిపైసా కక్కిస్తాం
- కాంగ్రెస్ నేతల జోలికి వస్తే చూస్తూ ఊరుకోం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరిక



బాన్సువాడలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

బాన్సువాడ: బీర్కూర్ ప్రాంతంలో ఇసుక మాఫియా చెలరేగుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఈ విషయమై మైనింగ్ అధికారులతో మాట్లాడానన్నారు. ఇసుక అక్రమ రవాణాతో సంపాదించిన ప్రతిపైసాను ఇసుకాసురులనుంచి కక్కిస్తామని పేర్కొన్నారు. బుధవారం ఆయన నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామానికి వచ్చారు. బీఆర్‌ఎస్ నేతల దాడిలో మరణించిన కాంగ్రెస్ గ్రామ నాయకుడు రాములు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాన్సువాడలో విలేకరులతో మాట్లాడారు. గత నెల 31న నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో జరిగిన కాంగ్రెస్ నేత రాములు హత్యను ఖండించారు. గత సర్పంచ్ ఎన్నికల్లో రాములు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారన్నారు. రాములుకు గ్రామంలో పలుకుబడి ఉండడంతో ఈసారి ఆయనే గెలుస్తారని భావించి బీఆర్‌ఎస్ నేతలు ఈ హత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు వ్యక్తులు అక్రమంగా సంపాదించిన డబ్బుతో ఎవరినైనా కొనవచ్చనే అహంకారంతో రౌడీయిజం చేస్తున్నారన్నారు. కేసును తారుమారు చేయాలని కొందరు పోలీసులు ప్రయత్నించారని, ఈ విషయమై జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడానని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఇంకా తమ పార్టీనే అధికారంలో ఉందనే భ్రమలో ఉన్నారన్నారు. దాడులు చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ. లక్ష ఆర్థిక సహాయం అందించామని మంత్రి పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి రూ.లక్ష ఇచ్చారన్నారు. ప్రతి కార్యకర్తకు నిరంతరం అందుబాటు లో ఉంటామని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు నార్ల రత్నకుమార్, ప్రతాప్‌సింగ్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, ఎలమంచలి శ్రీనివాస్‌రావు, కునీపూర్ రాజిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, బస్వరాజ్, చందు, లయక్, అఫ్రోజ్, నార్ల రాఘవేందర్ పాల్గొన్నారు.

### అండగా ఉంటాం..

నస్రుల్లాబాద్: కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు ప్రజలకు నిత్యం అండగా ఉంటామని పర్యటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం హత్యకు గురైన కాంగ్రెస్ నాయకుడు సాదుల రాములు కుటుంబ సభ్యులను మంత్రి మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. హత్యకు పాల్పడిన వ్యక్తులకు కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, విచారణ జరిపించాలని డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డిని ఆదేశించారు. రిపోర్టు మార్చే ప్రయత్నం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



హతుడు రాములు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి జూపల్లి

# ‘జీపీలోనూ దరఖాస్తులు ఇవ్వవచ్చు’

భిక్కనూరు: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ దరఖాస్తులు దాఖలు చేయడానికి తొందరపడాల్సిన అవసరం లేదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం బస్వాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ ప్రభుత్వం దరఖాస్తులను పంపిణీ చేస్తోందన్నారు. ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కాలపరిమితి అనేది లేదన్నారు. ప్రజలు తమ దరఖాస్తులను గ్రామపంచాయతీ కార్యాలయంలోనూ ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనంత్‌రావు, ఉపసర్పంచ్ భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

# ‘అధిష్టానం అవకాశమిస్తే పోటీకి సై’

కామారెడ్డి టౌన్: బీజేపీ అధిష్టానం అవకాశం ఇస్తే జహీరాబాద్ ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆ పార్టీ సీనియర్ నేత, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి మురళీధర్ గౌడ్ పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నాలుగు దశాబ్దాలుగా బీజేపీలోనే కొనసాగుతున్నానన్నారు. పార్టీ తనకు జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నీలం చిన్నరాజులు, నాయకులు తుమ్మ బాలకిషన్, కడెం శ్రీకాంత్, చింతల రమేష్, ప్రదీప్, పేర రమేష్, సురేష్, శ్యాంరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్

## క్లుప్తంగా

### తగ్గిన నీటి విడుదల

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి వారబందీ ప్రకారం కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం తగ్గించారు. మొదటి జోన్ కోసం కాలువ ద్వారా 3500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200, సరస్వతి కాలువ ద్వారా 500, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 472, గుత్ప లిఫ్ట్ ద్వారా 270, ఆవిరి రూపంలో 389 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు)అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 1086.20(70.67 టీఎంసీలు) అడుగుల నీటి నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

### జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



మాక్లూర్: జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు మండలంలోని గుత్ప ప్రభుత్వ పాఠశాల విద్యార్థి భార్గవ్ ఎంపికయ్యాడు. పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో భార్గవ్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, వీడీసీ సభ్యులు అభినందించారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు న్యూఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో నిర్వహించే జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం ద్రుపతి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట చిన్నయ్య, ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఉపసర్పంచ్ రాఘవేందర్‌రావు, పాఠశాల చైర్మన్ రమేశ్, వీడీసీ సభ్యులు ధర్మన్న, రాజన్న, ఉపాధ్యాయులు గిరిరాజ్, నరేందర్‌రావు, అంజనేయగౌడ్, శ్రీనివాస్, విష్ణుమూర్తి, నరేశ్, ప్రవీణ్ కుమార్, పీఈటీ సునీల్ పాల్గొన్నారు.

### జడ్జికి శుభాకాంక్షలు తెలిపిన సీపీ



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కోర్టు కార్యాలయంలో జడ్జి సునీత కుంచాలను కమిషనర్ ఆఫ్ పోలీస్ కల్మేశ్వర్ శింగెనవార్, అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ జయరాం మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏఆర్) గిరిరాజు, పరిపాలన అధికారి (ఏఓ) శ్రీనివాస్, సీటీసీఏసీపీ టీఎస్ శ్రావణ్ కుమార్, నిజామాబాద్ ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, సీసీఆర్‌బీ ఏసీపీలు కిరణ్ కుమార్, నారాయణ, రాజశేఖర్‌రాజు, రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం, సిబ్బంది ఉన్నారు.

# ఇబ్బందులు కలగకుండా చూడాలి

• కలెక్టర్ జితేష్ వి పాటిల్



అక్కాపూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

మాచారెడ్డి: అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల విషయంలో ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాల్వంచ మండల కేంద్రంతో పాటు బండరామేశ్వర పల్లి, మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. 6వ తేదీ వరకు అందరి నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను ఉచితంగా ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న ఐదు గ్యారంటీలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎంపీడీవో బాలకృష్ణ, మాచారెడ్డి, పాల్వంచ తహసీల్దార్లు శ్వేత, జయంత్ రెడ్డి, ఆయా శాఖల అధికారులున్నారు.

**రామారెడ్డి మండలంలో..**

రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి మండలంలోని కన్నాపూర్‌తండాలో గ్రామ సభను కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సవిత, సర్పంచ్ చందర్, పంచాయతీ కార్యదర్శి రాము పాల్గొన్నారు.

**దోమకొండ మండలంలో..**

దోమకొండ: మండలంలోని లింగుపల్లి, గొట్టిముక్కుల గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దరఖాస్తుల కొరత ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి, సర్పంచ్‌లు సాయిలు, ధర్పల్లి స్వరూప, తదితరులున్నారు.

# ఆకట్టుకుంటున్న డిజిటల్ విద్యాబోధన



వీడియో ద్వారా బోధన చేస్తున్న అధ్యాపకులు

బాన్సువాడ రూరల్: డిజిటల్ పరికరాలతో అగస్త్య ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న విద్యాబోధన విద్యార్థులను ఆకట్టుకుంటోందని బాన్సువాడ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విజయ్‌కుమార్ మాల్యాల అన్నారు. మంగళవారం పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ వారు తయారు చేసిన 30 గణితం, సైన్సు మాడ్యూల్స్‌ను ప్యానల్ బోర్డ్‌పై ప్రదర్శించారు. ఈ విధానంలో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకుంటూ ఆసక్తి ప్రదర్శిస్తున్నారని తెలిపారు. డిజిటల్ బోధన సత్ఫలితాలను ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ శంకర్, ఉపాధ్యాయులు రాఘవేందర్, ఆఫ్రీన్ సుల్తానా పాల్గొన్నారు.

### ఎండీఎం బిల్లులు మంజూరు చేయాలి

సుభాష్‌నగర్: మధ్యాహ్న భోజన బిల్లులు వెంటనే మంజూరు చేయాలని వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరి చక్రపాణి డిమాండ్‌చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎండీఎం పథకాన్ని నిర్వీర్యం చేసిందని తెలిపారు. ఆరునెలల నుంచి బిల్లులు బకాయిలు ఉన్నాయని, రూ. 15 కోట్ల వరకు రావాల్సి ఉందన్నారు.

# చేయిచేయి కలిపి.. బడిని నిర్మించి..

- రూ. మూడు కోట్లతో జక్రాన్‌పల్లి ఉన్నత పాఠశాల నిర్మాణం
- రూ. కోటి విరాళంగా ఇచ్చిన ప్రైవుల రాజిరెడ్డి
- మరో రూ. 75 లక్షలు ఇచ్చిన కుటుంబీకులు
- సహకారం అందించిన మరికొందరు దాతలు
- సర్వాంగ సుందరంగా పాఠశాల సిద్ధం



దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఉన్నత పాఠశాల

జక్రాన్‌పల్లి: ఎవరో రావాలి ఏదో చేయాలి అని ఎదురు చూడకుండా.. చేయి చేయి కలిపారు. సమష్టిగా జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేయాలని తలంచారు. అనుకున్నదే తడవుగా లాలన వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త గడ్డం రాజిరెడ్డి(పైవుల) అందుకు కేంద్ర బిందువుగా నిలిచారు. తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని సదుద్దేశంతో గతేడాది ఫిబ్రవరి 23న వసంత పంచమి రోజు పాఠశాల పునర్నిర్మాణం కోసం అంకురార్పణ చేశారు. పాఠశాలలో స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా పైవుల రాజిరెడ్డి, సభ్యులుగా పీడీ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గంగారెడ్డి, ఉపసర్పంచ్ బాల్‌కిషన్, డాక్టర్ సుభాష్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజిరెడ్డి పాఠశాల అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు. అందుకు గ్రామాభివృద్ధి కమిటీ, కుల సంఘాల సహకారం తోడయ్యింది. గ్రామంలోని ప్రతిఒక్కరూ పాఠశాల అభివృద్ధి కోసం తమవంతు సహాయాన్ని అందజేశారు. వ్యాపారవేత్త రాజిరెడ్డి రూ. కోటి నగదును అందించగా వారి కుటుంబ సభ్యులు మరో రూ. 75 లక్షలను అందజేశారు. మరికొంత మంది దాతల సహకారంతో సుమారు రూ. మూడు కోట్లతో పాఠశాలను అభివృద్ధి చేశారు. స్కూల్‌లో 20 తరగతి గదులను నిర్మించారు. డైనింగ్ హాల్, తాగునీటి సౌకర్యం, వేదిక, మరుగుదొడ్లు, ప్రత్యేకమైన వంటశాలను ఏర్పాటు చేశారు. పాఠశాలలో డిజిటల్ విద్యాబోధనకు అనుకూలంగా తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. సీసీ కెమెరాలను ఏర్పాటు సైతం చేశారు. డెస్క్ బెంచీలను సమకూర్చారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పాఠశాలను అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

**రేపు రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా ప్రారంభం**

జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునః ప్రారంభోత్సవానికి ఈ నెల 4న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పైవుల రాజిరెడ్డి, సభ్యులు ఉమామహేశ్వర్‌రెడ్డి, గంగారెడ్డి, బాల్‌కిషన్ తెలిపారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ఎంపీ అర్వింద్, మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, జెడ్పీ చైర్మన్ విఠల్, స్థానిక జెడ్పీటీసీ తనుజారెడ్డి, ఎంపీపీ విమల, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు హాజరుకానున్నట్లు తెలిపారు.

# 'రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి'



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

కామారెడ్డి క్రైం: నూతన సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా పూల బొకేలకు బదులుగా నోటు పుస్తకాలు, పెన్నులు, దుప్పట్లు అందించి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడంలో అధికారుల పాత్ర ప్రశంసనీయమన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికలను కూడా సజావుగా నిర్వహించడానికి రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థ సేవలను మరింత విస్తరించడానికి ప్రతి అధికారి సంస్థలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. జిల్లాలోని బ్లడ్ బ్యాంక్‌లో రక్తం నిల్వలు లేక చాలా మంది ఇబ్బందిపడుతున్నారన్నారు. ఉద్యోగులు ప్రతినెల రక్తదానం చేసేలా క్యాలెండర్ రూపొందించడానికి త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా అధికారులు సాయన్న, సాయాగౌడ్, రాజారాం, షార్స్ యాదవ్, భాగ్యలక్ష్మి, దయానంద్, సాయిబాబా, సింహారావు పాల్గొన్నారు.

# జాతీయ సాహస శిబిరంలో తెయూ వలంటీర్లు



తెయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

తెయూ(డిచ్‌పల్లి): హిమాచల్‌ప్రదేశ్‌లో నేటి నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సాహస శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు తెయూకు చెందిన 10 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బయలు దేరినట్లు ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. శిబిరంలో తెయూతో పాటు అనుబంధ డిగ్రీ/పీజీ కళాశాలలకు చెందిన సురేశ్, వినోద్, ఎల్.సంతోష్, రాజేశ్వరి, ఎన్.దీపిక, ఎస్.భార్గవి, ఎన్. విజ్ఞాన, జి.రక్షిత, కె.రవితేజ, ఎండీ సమర్ అహ్మద్ ఉన్నట్లు ఆయన తెలిపారు. బృందానికి కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ శారద (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామారెడ్డి) వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వీరు అటల్‌బిహార్ వాజ్‌పేయ్ పర్వతారోహణ శిక్షణ శిబిరంలో రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్, స్కేయింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటి అంశాల్లో శిక్షణ పొందనున్నారు. శిబిరంలో ప్రతి రోజూ నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు.

# అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పాలకమండలి (ఈసీ) నిర్ణయాలను వెంటనే అమలు చేసి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. వర్సిటీ ఏబీవీపీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలల తరగతులను బహిష్కరించి రిజిస్ట్రార్ చాంబర్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బచ్చన బోయిన శివ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వర్సిటీ అధికారులు, సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. బాలికలకు నూతన వసతి గృహం, ఆడిటోరియం నిర్మించాలన్నారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్ సౌకర్యం కల్పించాలని, ప్రయోగశాలలు మెరుగుపర్చాలన్నారు. అనంతరం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయికృష్ణ, ప్రమోద్, అమృత్‌చారి, సింహాద్రి, సాయికుమార్, నరేశ్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ యువజన ఉత్సవాలకు వర్సిటీ విద్యార్థులు



శరణ్యను అభినందిస్తున్న రవీందర్‌రెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): మహారాష్ట్రలో ఈ నెల 12 నుంచి 16వరకు నిర్వహించే 27వ జాతీయ యువజన ఉత్సవాలకు తెయూ పరిధి నుంచి టి.శరణ్య, వి.రేవంత్‌చారి ఎంపికైనట్లు వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కె.రవీందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. తెయూ తరపున ఎంపికైన వీరు మిగిలిన యూనివర్సిటీలతో కలిసి తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఉత్సవాల్లో ప్రధానంగా వివిధ సంస్కృతులు, కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. యువజన ఉత్సవాలకు ఎంపికైన శరణ్య, రేవంత్‌చారిలను రిజిస్ట్రార్ యాదగిరి, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి అభినందించారు.

## జుక్కల్ అభివృద్ధికి సీఎం కృషి : జుక్కల్ ఎమ్మెల్యే



రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎంను ఆయన కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. విద్య, వైద్యం, అభివృద్ధి పరంగా అన్నిరంగాల్లో వెనుకబడిన జుక్కల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని సీఎంను కోరానన్నారు. ఈ విషయమై సీఎం సానుకూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ మేరకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్యారోగ్యశాఖ మంత్రిని కలిసిన మాజీసర్పంచ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను మంగళవారం నాగిరెడ్డిపేట మాజీసర్పంచ్ విఠల్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీంతోపాటు నాగిరెడ్డిపేట మండలంలో చాలాకాలంగా అంబులెన్స్ సమస్య ఉందని, దీనివల్ల మండల ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నాగిరెడ్డిపేట మండలానికి అంబులెన్స్‌ను కేటాయించాలని కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించారని విఠల్‌రెడ్డి చెప్పారు.



## క్రైం కార్నర్

### మట్కా నిర్వాహకుల అరెస్టు

బోధన్‌టౌన్: పట్టణంలోని రెంజల్ బేస్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురు నిర్వాహకులను అరెస్టు చేసినట్లు సీఐ వీరయ్య మంగళవారం తెలిపారు. పట్టణంలోని రెంజల్ బేస్ ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో నిర్వాహకులు రియాజ్ , ఖాసీమ్, నయీమొద్దీన్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ. 5200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### అక్రమంగా వడ్లు తరలిస్తున్న లారీ పట్టివేత



వర్ని: మండల కేంద్రంలో అక్రమంగా రైస్‌మిల్ నుంచి వడ్లను తరలిస్తున్న ఓ లారీని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. కోటగిరి మండలంలోని ఓ రైస్ మిల్ నుంచి 374 క్వింటాళ్ల వరిధాన్యాన్ని అక్రమంగా మిర్యాలగూడకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు డీటీ నిఖిల్‌రాజ్ తెలిపారు. రైస్ మిల్లులకు ప్రభుత్వం ఇచ్చిన వడ్లను అక్రమంగా అమ్ముకుంటున్నారన్న సమాచారం మేరకు లారీని తనిఖీ చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అధికారుల వెంట వర్ని ఎస్సై కృష్ణకుమార్, డీటీ అశ్వక్ ఉన్నారు.

# చికిత్స పొందుతూ ఒకరి మృతి

రెంజల్: మండల కేంద్రానికి చెందిన అగ్గు శంకర్(45) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. తాగుడుకు బానిసైన శంకర్ తరచూ భార్యతో గొడవపడేవాడు. డిసెంబర్ 31న ఇంట్లో గొడవల కారణంగా పురుగుల మందు సేవించిన శంకర్ అపస్మారకస్థితికి చేరాడు. గమనించిన కుటుంబీకులు, చుట్టుపక్కల వారు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**మంచిప్ప తండాలో మరొకరు..**



నెనావత్ బంటు (ఫైల్)

మోపాల్: మండలంలోని మంచిప్ప తండాకు చెందిన నెనావత్ బంటు (16) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బంటు పదో తరగతి వరకు చదివి వ్యవసాయ పనులు చేస్తున్నాడు. గత డిసెంబర్ 24న చెట్టు కొమ్మలకు గాలిపటం చిక్కుకుందని తీసేందుకు వెళ్లగా కొమ్మ విరిగి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కుటుంబీకులు, గ్రామస్తులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుమారుడి మృతితో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి.

# వరదకాలువలో పడి యువకుడు..



అజేశ్ (ఫైల్)

మోర్తాడ్: మండల శివారులోని వరద కాలువలో పడి అజేశ్(23) అనే యువకుడు మృతిచెందినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలానికి చెందిన అజేశ్ మండల కేంద్రంలో రక్త, మూత్ర పరీక్షల ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. గతంలో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేసిన అతను కొన్ని కారణాలతో బయటకు వచ్చి సొంతంగా ల్యాబ్ పెట్టాడు. ఆస్పత్రిలో పనిచేసినప్పుడు నిర్వాహకులతో ఆర్థిక లావాదేవీల విషయమై గొడవ జరిగినట్లు తెలిసింది. మనస్తాపానికి గురైన అజేశ్ మూడు రోజుల క్రితం కనిపించకుండాపోయాడు. కుటుంబ సభ్యులు మోర్తాడ్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం వరదకాలువలో మృతదేహం లభించడంతో మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. ఇదిలా ఉండగా ఆస్పత్రి నిర్వాహకులు వేధింపులతోనే తమ కుమారుడు మరణించినట్లు మృతుడి తల్లితండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబీకులు ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత



పెద్దకొడప్‌గల్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై కోనారెడ్డి మంగళవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని బిచ్కుంద ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు బాన్సువాడ డివిజన్ పౌరసరఫరా శాఖ అధికారి ఎండీ ఖాలేద్ తెలిపారు. ఎవరైనా రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. వారి వెంట అధికారులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

### దూపల్లిలో ఇసుక ట్రాక్టర్..

రెంజల్: దూపల్లి గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఇసుకను తరలిస్తున్న సమాచారం అందడంతో దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌కు పీఎస్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

### పోలీసుల అదుపులో మరో ఇద్దరు 'కొకైన్' నిందితులు

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి పీఎస్ పరిధిలో డిసెంబర్ 31న టాస్క్‌ఫోర్సు పోలీసులు కొకైన్‌తో పాటు మాదకద్రవ్యాలను పట్టుకున్న కేసులో మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు కొకైన్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలను తరలిస్తున్న నిందితులను పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. నడిపల్లి తండా వద్ద దొరికిన ఇద్దరు నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఇప్పటికే గంజాయి విచ్చలవిడిగా అమ్ముతుండగా కొకైన్‌తో పాటు మత్తుపదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకోవడం కలకలం రేపుతోంది.

# మోగిన సైరన్.. దొరికిన దొంగ



బ్యాంకులోకి చొరబడిన దొంగ



బ్యాంకు వద్దకు తరలివచ్చిన గ్రామస్తులు

ధర్పల్లి: బ్యాంకులో చోరీకి పాల్పడేందుకు వెళ్లిన ఓ దొంగ సైరన్ మోగడంతో పోలీసులకు చిక్కిన ఘటన మండలంలోని దుబ్బాక ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వంశీకృష్ణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రెంజల్ మండలం దూపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి సోమవారం రాత్రి బ్యాంకు తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డాడు. వెంటనే బ్యాంకు మేనేజర్ రాజు సెల్‌ఫోన్‌కు సైరన్ మోగింది. వెంటనే అతను పోలీసులు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. గ్రామస్తులను చూసిన దొంగ తనను కొడతారేమోననే భయంతో లోపలే ఉండిపోయాడు. తాను జిల్లా కేంద్రంలో మద్యం సేవిస్తున్న చోట బిహార్ ముఠా సభ్యులు పరిచమయ్యారని పోలీసులతో చెప్పాడు. వారు బ్యాంకులో దొంగతనం చేద్దామని చెప్పి తనను తీసుకొచ్చారని తనతో పాటు పది మంది బిహార్ సభ్యులు ఉన్నట్లు నమ్మబలికాడు. దీంతో వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏసీపీ కిరణ్‌కుమార్‌తో పాటు ధర్పల్లి సీఐ సైదా, సిరికొండ, జక్రాన్‌పల్లి, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి, టూటౌన్ ఎస్సైలు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. బిహార్ గ్యాంగ్ వారు ఎక్కడున్నారని సీఐ ప్రశ్నించగా బాత్‌రూంలో ఉన్నట్లు చెప్పాడు. వెనుకవైపు ఉన్న కిటికీలో నుంచి సీఐ చూడగా అందులో ఎవరూ లేరు. లోపల ఒకరే ఉన్నట్లు నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఊపిరి పీల్చుకుని నిందితుడిని అరెస్టు చేశారు. సంతోష్‌రెడ్డిపై రెంజల్ పీఎస్‌లో పాత కేసులు ఉన్నట్లు తెలిపారు. బ్యాంకులో ఎలాంటి సొత్తు చోరీకి గురి కాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.